ప్రజాశక్తి
శుక్రవారం 7 ఏప్రిల్ 2023
5
అల్లూరి సీతారామరాజు



ఆటిజంపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి -పాడేరు:ఏజెన్సీలో ఆటిజం పై అవగాహనకు మండల స్థాయిలో సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ప్రపంచ ఆటిజం దినం సందర్భంగా కలెక్టరేట్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, అర్హులకు గుర్తింపు పత్రాలు ఇచ్చేందుకు అవసరమయితే క్యాంపులు నిర్వహించాలని సూచించారు. నేషనల్ ట్రస్ట్ ప్రకారం గుర్తింపబడ్డ వ్యాధిగ్రస్తులను నిరామయ హెల్త్ ఇన్సూరెన్స్‌లో నమోదుకు గ్రామ సచివాలయం ద్వారా వివరాలు తీసు కోవడానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. వీరి పేర్లు నమోదుకు అవసరమైతే ఫీజులు కట్టడానికి తగు చర్యలు తీసుకోమని కలెక్టర్ ఆదేశించారు. ది ఎబిలిటీ పీపుల్ సంస్థ అధ్యక్షులు దిలీప్ పాత్రో మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా ఇంటింటికి సిబ్బందిని పంపి తగు వైద్య సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. వీరికి నిరామయ ఇన్సూరెన్స్ మంజూరు చేసేందుకు పేర్లు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ (విభిన్న ప్రతిభావంతులు) జె.మాధవి, జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ భాస్కర్ రావు, ఐఈఆర్‌పిలు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

▶▶ కలెక్టర్ సుమిత్ కుమార్ ▶▶ ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-హుకుంపేట:ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం లో గిరిజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మండలంలోని సూకూరు గ్రామ పంచాయతీ సచివాలయం వద్దకు ఫ్యామిలీ పిజిషియన్ విధానాన్ని అరకు శాసనసభ్యులు శెట్టి పాల్గుణతో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నారని, ఒక వైద్యుడు సచివాలయం పరిధిలోని వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వారానికి రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తారని, బీపీ, షుగర్‌తో బాధ పడుతున్న రోగులకు రెగ్యులర్‌గా పరీక్షలు చేస్తారని తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు సచివాలయంలో నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాకు 34 అంబులెన్స్ అందుబాటులో ఉన్నాయని, చిన్న పిల్లలకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు నాటు వైద్యులను ఆశ్రయిస్తే ప్రాణాపాయం ఉంటుందన్నారు. పీహెచ్‌లోనే 90 శాతం ఖాళీలను భర్తీ చేశామన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదు నుండి 10 బెడ్స్ అందుబాటులో ఉన్నాయని, గర్భిణీలు ప్రసవ సమయానికి రెండు వారాలు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని ఆయన సూచించారు. ఆశాలు, ఏఎన్‌ఎంలు ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ప్రజలకు చైతన్యవంతం చేయాలని అయన సూచించారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారన్నారు. అనంతరం మెడికల్ రికార్డులను పరిశీలించారు.

అరకు శాసనసభ్యులు పాల్గుణ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. వైద్య సేవలకు అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రూ.500 కోట్ల వ్యయంతో పాడేరులో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నామన్నారు. మంచానికి పరిమితమైన వృద్ధులు, వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డిటిసిఓ విశ్వేశ్వర్ నాయుడు, ఎంపీపీ కూడా రాజబాబు, జెడ్పిటిసి రేగం మత్స్యలింగం, సూకూరు సర్పంచ్ దనసాని సత్యవతి, హుకుంపేట సర్పంచ్ వెంకట పూర్ణిమ, జిల్లా మేనేజర్ ఎస్.మురళి, వైద్యాధికారి మోహన్ సాయి రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి:

మండలంలోని తంటికొండ సచివాలయం ఒట్టిగడ్డ గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారి లిఖిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి దేశచరిత్రలోనే వైద్యసేవల విధానంలో నూతన విధానానికి శ్రీకారం చూట్టారని తెలిపారు. ఆధునిక వైద్యాన్ని ఉచితంగా ప్రతి గడప వద్దకు తీసుకొచ్చే విధానమే ఫ్యామిలీ డాక్టర్ అని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ప్రతి పేదవాడి ఇంటి ముందుకు డాక్టరు, మందులు వస్తాయని, పింఛన్లు ఇంటికి నడిచి వచ్చినట్లుగా వైద్యం కూడా మీ ముంగిట్లోకి వస్తుందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు ఉంటాయని, ఇందులో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ విలేజ్ క్లినిక్‌లను పీహెచ్‌సీలతో అనుసంధానిస్తారని తెలిపారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ పరిధిలో నయం కాని రోగాలను వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ ద్వారా ఆరోగ్యశ్రీకి రిఫర్ చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి

బోయ/వాల్మీకుల తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ..

మండల సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీపీ బీ.ఈశ్వరి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిటీసీ సభ్యులు, సర్పంచులు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించి భాగస్వాములు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు జాప్యం చేయకుండా వేగంగా పనులు చేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఎస్ ఆనంద్, లలిత, ఎంపీడీవో నగేష్, తహసిల్దార్ షేక్ ముజీబ్, సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి అవస్థలు

గాజు గుచ్చుకుని కాలికి గాయం

ఆసుపత్రికి తోటి విద్యార్థులు తరలింపు

ప్రజాశక్తి-హుకుంపేట: చిన్నపాటి జ్వరాలు, ఇతర సమస్యలు వస్తే విద్యార్థులు తమంతట తామే ఆసుపత్రులకు వెళ్ళవలసిన దుస్థితి దాపరించింది. మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి చందుకు గురువారం గాజు పెంకు గుచ్చుకోవడంతో కుడి కాలుకి గాయమైంది. దీంతో నడవలేని స్థితిలో ఉండటంతో తోటి విద్యార్థుల సహాయంతో ఆసుపత్రికి అవస్థలు పడుతూ వెళ్లాడు. ఆ విద్యార్థి నడవలేక పోవడంతో సహచర విద్యార్థి తమ భుజాల మీద వేసుకుని తీసుకు వెళు తుండటాన్ని గమనించిన గ్రామస్తులు ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నడవ లేని పరిస్థితిలో ఉండటంతో తోటి విద్యార్థులు పాఠశాలకు మోసుకొస్తున్న ఘటన చూసి అందరిని కలిసివేసింది.



మోసుకొని వెళుతున్న తోటి విద్యార్థి



పట్టుబడిన నిందితునితో పోలీసులు

గంజాయి తరలిస్తున్న విద్యార్థి అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... జికె.వీధి మండలం సీలేరు రామాలయం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బీటెక్ చదువుతున్న ముదిగొండ సాయి సురేంద్రను అదుపులోకి తీసుకున్నారు. ఆ విద్యార్థిని తనిఖీ చేయగా 24 కేజీలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో పట్టుబడిన గంజాయి, రూ.900 నగదు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సదరు విద్యార్థిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.

టెన్త్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని పలు టెన్త్ పరీక్ష కేంద్రాలను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే గురువారం పరిశీలించారు. రంపచోడవరం మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, లెనోవో హైస్కూల్, గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల, మారేడుమిల్లి మండలంలోని గిరిజన గురుకుల బాలుర హైస్కూల్, బోదులూరు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల తదితర వాటిల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రైవేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు..

ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు

ఈ నెల 10 వరకు దరఖాస్తు గడువు

ప్రజాశక్తి -పాడేరు: విద్యా హక్కు చట్టం ద్వారా రాష్ట్రం లో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్లలో 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో అర్హులైన పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 24ను జారీ చేసింది. ఈ జీవో ప్రకారం ఐపిఎస్ఈ, పిబిఎస్ఈ, స్టేట్ సిలబస్ మేనేజిమెంట్ స్కూల్స్ అన్నింటిలోను విద్య హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను అర్హులైన పేద వర్గాల పిల్లలకు కేటాయించాల్సి ఉంటుంది.ఈ సీట్లకు సంబందించి మార్చి 4న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆయా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూళ్ళు ప్రభుత్వ వెబ్సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రానున్న విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులు ఏప్రిల్ 10వ తేదీ వరకు సంబంధిత వెబ్సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అర్హులైన విద్యార్థుల ఎంపిక ఏప్రిల్ 13 నుంచి 17 వరకు జరుగుతుంది. మొదటి విడత సీట్ల కేటాయింపు ఏప్రిల్ 18న ఉంటుంది. విద్యార్థులు ఏప్రిల్ 19 నుంచి 25వ తేదీ లోపు ఆయా స్కూళ్లలో చేరికలను ఖరారు చేసుకోవాలి. రెండో విడత సీట్ల కేటాయింపు ఏప్రిల్ 29న చేపడతారు. ఎంపిక అయిన విద్యార్థులు మే 1 నుండి 5వ తేదీ లోపు ఆయా స్కూళ్ళలో చేరాలి. ఈ ప్రవేశాలకు సంబంధించి సమస్యలకు 14417 టోల్ ఫ్రీ నెంబరులో సంప్రదించాలి. ఈ పాఠశాలకు రియింబర్స్ కింది ఒక్కొక్క విద్యార్థికి పట్టణం ప్రాంతాలలో రూ. 8000 వేలు, రూరల్‌లో రూ.6500, గిరిజన ప్రాంతాలలో రూ. 5,100 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. అనాథలు, హెచ్ ఐవి బాధితులు దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, సంవత్సరానికి గ్రామాలలో రూ.1.20 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షల లోపు ఆదాయం ఉన్న బలహీన వర్గాల వారి కుటుంబాల పిల్లలకు ఆరు శాతం సీట్లు కేటాయించాలి. ఈ రిజిస్ట్రేషన్‌లో విద్యార్థులు లేకపోతే వాటిని ఇతరులకు కేటాయిస్తారు. గిరిజన ప్రాంతాలలో ఎస్టీ బాల బాలికలకు ప్రాధాన్యత ఉంటుంది. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.సలీం భాష సూచించారు.

దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి-జి.మాడుగుల:పోలీస్ శాఖ, సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో మండలం లోని ఈదులబైలు, బూస్పల్లి, జోగులు పుట్టులోని గిరిజన ప్రజలకు దోమ తెరలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జి.మాడుగుల సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ, గిరిజనులు ఆరోగ్య నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, సిఆర్పిఎఫ్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న పోలీసులు

సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలోని పాలమామిడి సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో చంద్రశేఖర రావు సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, ఆర్బికే కేంద్రాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానిక సర్పంచ్ రామకృష్ణ, కాంట్రాక్టర్ సూచించారు. అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేశారు.

అందని జియో సిగ్నల్స్

అవస్థలు పడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి-జి.మాడుగుల:గత పది రోజుల నుండి మండల కేంద్రంలో జియో సేవలు సరిగ్గా పని చేయక పోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగ్నల్ సరిగ్గా అందక పోవడంతో లబోదిబో మంటున్నారు. దీంతో, చేసేదేమీ లేక వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ సేవలను ఆశ్రయిస్తున్నారు. జియో అధికారులు స్పందించి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:అరకు- కిరండోల్ రైల్వే లైన్ మండలంలోని గోరాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని పితమరిగుడ రైల్వే పట్టాలపై ఓ గిరిజన యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఆర్పీఎఫ్ సీఐ మహేష్ తెలిపిన వివరాలు... ఒడిశా రాష్ట్రం పాడువా గ్రామానికి చెందిన ప్రతాఫ్ కుమార్(22) యువకుడు ఆత్మహత్య చేసుకోవడానికి బుధవారం రాత్రి రైల్వే పట్టాలపై పడుకోవడంతో గూడ్స్ రైలు అతనిపై ఎక్కడంతో మృతి చెందినట్లు తెలిపారు. ప్రేమ వ్యవహారంతో పాటు, ఐపీఎల్ మ్యాచ్‌లో బెట్టింగ్లకు పాల్పడి ఆర్థికంగా నష్టపోయినట్లు మృతుడి తల్లిదండ్రులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరుటౌన్:వాతావరణంలో మార్పుల కారణంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వాతావరణం కొనసాగి, ఆ తర్వాత వాతావరణం మారింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత భారీ వర్షం కురిసింది. గంటసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. భారీగా వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు వీధులు జలమయ మయ్యాయి. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహన దారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.



కురుస్తున్న వర్షం

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై..

ఎమ్మెల్యే ధనలక్ష్మికి నిరసన సెగ

రేఖపల్లి రోడ్డులో నిలదీసిన గిరిజనులు



రేఖపల్లి రోడ్డులో ఎమ్మెల్యే ధనలక్ష్మిని అడ్డగించిన గిరిజనులు

ప్రజాశక్తి - విఆర్.పురం

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిను గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసిల ఆధ్వర్యంలో గురువారం గిరిజనులు, గిరిజన ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. మండల కేంద్రమైన రేఖపల్లిలో ఆసరా పథకంపై తలపెట్టిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి వచ్చారు. ఆమెను ప్రధాన కూడలి వద్ద గిరిజనులు అడ్డగించి 'ఎమ్మెల్యే గో బ్యాక్' అంటూ పెద్దపెట్టున నినదించారు. బోయ/వాల్మీకిలను, బెంతో ఒరియాలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై మీతో సహా ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలూ ఇంత వరకూ ఎందుకు స్పందించలేదంటూ నిలదీశారు. ఇతరులను ఎస్‌టి జాబితాలో చేర్చితే నిజమైన గిరిజనులు విద్య, ఉపాధి సహా అన్నింటా అన్యాయానికి గురవుతారన్నారు. గిరిజనుల ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకుండానే అక్కడి నుంచి ఎమ్మెల్యే జారుకున్నారు. అనంతరం రేఖపల్లి కూడలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, గిరిజన సంఘం నాయకులు పులి సంతోష్ కుమార్, ఎంపిటిసి పూనం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలన్నారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ చేసిన తీర్మానాన్ని రద్దు చేసేవరకూ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా తీర్మానం చేస్తున్నప్పుడు గిరిజన ఎమ్మెల్యేలు ఎందుకు నోరుమెదపలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ప్రజా ప్రతినిధులు పి.సరోజిని, కారం బుచ్చమ్మ, సవలం మారయ్య, వేటి లక్ష్మి, పాయం లక్ష్మణరావు, కారం సుందరయ్య, పొడియం శ్రీరామ్మూర్తి, చిక్కాల రామారావు, వాళ్ల వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను అడ్డగించేందుకు వెళ్తున్న ఎంపిటిసి ప్రదీప్‌ను నిలువరిస్తున్న పోలీసులు

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

లోదొడ్డి పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బోయ వాల్మీకి, బెంతు, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చరాదని లోదొడ్డి సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆధ్వర్యంలో పంచాయితీ పాలకవర్గం గురువారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. గురువారం లోదొడ్డి పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులు జర్తా రాజబాబు అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ లోతా రామారావు మాట్లాడుతూ, బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించడం జరిగిందని తెలిపారు. ఎటువంటి గిరిజన సంప్రదాయాలు లేని బిసి ఏలో ఉన్న బోయ వాల్మీకి, బెంతు, ఒరియాలు 40లక్షల మందిని ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం 52 జీవో తీసుకురావడం దారుణమన్నారు. దీనివలన ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న నిజమైన గిరిజనులు 25 లక్షల మందికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన జాబితాలో మైదాన ప్రాంతంలో బీసీ ఏలో ఉన్న వారిని ఎస్టీ జాబితాలో చేరిస్తే నిజమైన గిరిజనుల బతుకులు అన్యాయమవుతాయని తెలిపారు. అనంతరం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 52ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో లోదొడ్డి ఉప సర్పంచ్ బురారి రాజుబాబు, వార్డు సభ్యులు పొత్తూరు సింహాద్రి, కె మంగి రెడ్డి, పి లోవరాజు, కె రాజు బాబు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ పాలకవర్గం సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ లోతా రామారావు

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కొయ్యూరు, సీలేరు

ఏపీ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పలు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు 2012 జూన్ 1 నుంచి 2014 మే 31 మధ్యలో జన్మించి వారై ఉండి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు లోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశానికి కుల ధ్రువీకరణ పత్రాలు తప్పకుండా సమర్పించవలసి ఉంటుందని తెలిపారు.

కొయ్యూరు ఎపి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 5వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉన్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గానివాడ శ్రీనివాసరావు తెలిపారు. 80 సీట్లలకుగాను ఎస్టీలకు 60 సీట్లు, ఎస్సిలకు 10 సీట్లు, బిసిలకు 4, ఓబిసిలకు 2సీట్లు, ఎఐక్యూలకు 2 సీట్లు, పిహెచ్ (ఎస్టీలకు) 2 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి 80 సీట్లు ఉండగా ఇందులో 60 సీట్లు ఎస్టీలకు, ఎస్సీలకు 10 సీట్లు, బీసీలకు 4, ఓబీసీలకు 2, ఎఐక్యూలకు 2, పిహెచ్‌సి (ఎస్టీలకు) 2 కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ తెలిపారు. ఈ రెండు పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులలో ఖాళీలు (ఎస్టీలకు మాత్రమే) కూడా ఉన్నాయని, 5వ తరగతితో పాటు 6, 7, 8, 9 తరగతుల్లోని ఖాళీ సీట్లలో ప్రవేశానికి ఆసక్తి గల వారు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ సూచించారు. మే 7వ తేదీన దరఖాస్తుదారులు కోరుకున్న సెంటర్‌లో పరీక్ష నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేయుటకు పూర్తి వివరాలకు గురుకుల వెబ్ సైట్ www.aptwgurukulam. ap.gov.in చూడాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

రాజవొమ్మంగి : స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవేణి గురువారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం నాల్గవ తరగతి చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సామాజిక తరగతులకు చెందిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సూచించారు. అర్హులు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్థిని ఫొటోతో పాటు ఫోన్ నెంబర్‌ను పొందుపరచాలని సూచించారు.

వైసిపి బెదిరింపులపై మాజీ ఎంపిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : వైసిపికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు సుంకర గిరిబాబు, గంధవరం సర్పంచ్ జివికె వర్మ (మురళీరాజు) ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారని సిటీ పోలీస్ కమిషనర్‌కు మాజీ ఎంపిపి దంతులూరి గోపాలకృష్ణమూర్తి (గోపిబాబు) గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి... మండలంలోని కొవ్వాడ, గంధవరం, నారాయణపురం, నరసాపురం, రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లో పేదలకు ఇళ్ల నిమిత్తం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌ను ఆసరా చేసుకొని గిరిబాబు, జివికె వర్మరాజు, మరి కొంత మంది నాయకులు కలిసి రైతులను మోసం చేసి, విలువైన భూమిని సొంతం చేసుకొని అక్రమంగా ప్లాట్లు పొందారని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు తన దృష్టికి తీసుకురావడంతో ఆర్‌టిఐ ద్వారా సమాచారం తీసుకున్నానని పేర్కొన్నారు. ఆర్‌టిఐ ద్వారా తహశీల్దార్ ఇచ్చిన సమాచారంలో గిరిబాబు, ఆయన వర్గీయులు కలిసి బినామీల పేర్లతో సుమారు 65 నుంచి 70 ఎకరాల భూమిని అక్రమంగా పొంది, తునివలస లే-అవుట్‌లో ప్లాట్లు తీసుకున్నారని తెలిపారు. అప్పటిలో రైతుల వద్ద తీసుకున్న భూమిలో మామిడి, జీడి తదితర చెట్లు ఉంటే వాటిని తొలగించి ప్లాట్లు వేశారని తెలిపారు. రైతుల వద్ద తీసుకున్న భూమికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇవ్వాల్సిన పరిహారం, భూమి ఇవ్వలేదని వివరించారు. దీనిపై ఈ నెల 3వ తేదీన జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశానని, తనకు బెందిరింపు కాల్స్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పద్మనాభం నేతలకు అభినందనలు

ప్రజాశక్తి-పద్మనాభం : విశాఖలో బుధవారం నిర్వహించిన జోన్-1 సమావేశంలో పద్మనాభం మండల టిడిపి కేడర్‌ను చంద్రబాబు అభినందించారని పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ తెలిపారు. పద్మనాభంలోని టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించినందుకు, బాదుడే బాదుడే.., ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు చంద్రబాబు అభినందించినట్లు పేర్కొన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కోరాడ రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కశిరెడ్డి దామోదరరావు, రేవిడి మాజీ సర్పంచ్ పాండ్రంగి అప్పలనాయడు తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.లీలావతి, బోదల పావని, కె.సత్యనారాయణ, కె.లక్ష్మి, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-లీగల్ : కొత్త ఢిల్లీలో న్యాయవాది హత్యకు నిరసనగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యాన గురువారం కోర్టు విధులు బహిష్కరించి సంఘీభావం ప్రకటించారు. ఇటీవల కొత్త ఢిల్లీలో న్యాయవాది వీరేంద్ర కుమార్ నర్వాల్‌ను దుండగులు నరికి చంపారని, రాజమండ్రిలో రాత్రి 12 గంటల తర్వాత ఆసుపత్రి నుంచి వస్తున్న న్యాయవాది డి.సుభాష్‌ను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని, ఈ ఘటనలకు నిరసనగా విధులు బహిష్కరించినట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ, న్యాయవాదులపై జరుగుతున్న ఇటువంటి దాడులను అరికట్టేందుకు రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజమండ్రిలో ఘటనలో సంబంధిత పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసి ఆంధ్రప్రదేశ్ డిజిపికి, విశాఖపట్నం కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు.

10న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐటిఐ కోర్సులు పూర్తిచేసి అప్రెంటిస్‌షిప్ చేయని వారి కోసం కంచరపాలెంలోనిపాత ఐటిఐ కళాశాల ఆవరణలో ఈ నెల 10న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా-2023 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్, జోన్-1 ఉపసంచాలకులు ఆర్‌వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ అన్ని ట్రేడ్ల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ మేళాలో ప్రభుత్వ రంగ సంస్థలు ఐఆర్‌ఇఎల్ (ఇండియా), ఎల్‌టిడి, సుమారు 15కి పైగా ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని తమ సంస్థల్లో అవకాశం కల్పిస్తాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మిషన్ వాత్సల్య అందరికీ చేరాలి

ప్రజాశక్తి -కంచరపాలెం : 18 ఏళ్లలోపు ఉన్న అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం ఎంతగానో దోహదపడుతుందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకునేలా అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి పేర్కొన్నారు. ఆర్ అండ్ బి వద్ద ఉన్న విశాఖ శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి అంగన్‌వాడీ పరిధిలో పథకం గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అర్హులను గుర్తించి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వరి, సిడిపిఒ ఎంవి.రమణికుమారి, అడిషనల్ సిడిపిఒ శ్రీలత పాల్గొన్నారు.

స్టీల్ సహాయ మంత్రితో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాల భేటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఢిల్లీలో ఉన్న ఉద్యోగ భవనంలో స్టీల్ సహాయ మంత్రి ఫ్గాన్‌సింగ్ కులేస్తేతో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాల నేతలు భేటీ అయ్యారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ తరుపున సిజిఎం కల్లూరి శ్రీనివాస్, హెచ్‌ఆర్ విభాగ జిఎం కంచెర్ల సంజీవరావు, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య హాజరై స్టీల్‌ప్లాంట్‌లో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యలు వివరించారు. మూడేళ్లుగా ఎగ్జిక్యూటివ్ ప్రమోషన్స్ ఇవ్వలేదని, సిజిఎన్ క్యాడర్‌లో ఎస్‌సి, ఎస్‌టిలు ఒక్కరైనా లేరని, వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు జూనియర్ ఆఫీసర్ టెస్ట్ నిర్వహించాలని కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, రిజర్వేషన్లు కాపాడాలని, వరల్డ్ ట్రైబల్ డేను యాజమాన్యం అధికారికంగా నిర్వహించాలని, పిఆర్‌సి కమిటీలో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించి యాజమాన్యం ఇప్పటి వరకూ ఎస్‌సి, ఎస్‌టిల


కేంద్ర స్టీల్ సహాయ మంత్రిని కలిసిన ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు

కోసం తీసుకుంటున్న వెల్ఫేర్ చర్యలు గురించి చర్చించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని తగు ఆదేశాలు జారీ చేశారు.

సుబ్బారావు సేవలు ఎనలేనివి


సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు జి.సుబ్బారావు సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. జివిఎంసి 25వ వార్డు పరిధి బానోజీతోటలో ఆర్.నాగేశ్వరరావు ఆధ్వర్యాన సుబ్బారావు సంతాపసభ నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎన్.రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సుబ్బారావు ఆశయాల దిట్ట అన్నారు. ఆయన మార్గంలో పయనించడమే కార్మికరాజ్యానికి సరైన మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు, బి.శ్రీనివాస్, ఎం.జ్యోతి, శ్యామ్, మీనాక్షి, నాగరాజు, వార్డులోని అభిమానులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్రంలో పరిశోధనలపై గీతం వర్క్‌షాప్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన న్యాయశాస్త్రంలో పరిశోధనలపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. ఫుల్‌బ్రైట్ స్కాలర్, ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పరిశోధకులు ప్రొఫెసర్ మార్గరేట్ ఫిలిప్స్ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో "రైట్ టూ యాక్సెస్ టూ జస్టిస్" అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. ప్రపంచం అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధిస్తున్నా వివిధ దేశాలలో ఇప్పటికి తమకు జరిగిన అన్యాయాలను న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లాలన్న అవగాహన ప్రజలలో ముఖ్యంగా సమాజంలో అట్టడుగు వర్గాల వారికి లేకపోవడం విచారకరమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే దేశంలో న్యాయాలు, చట్టాల పట్ల ప్రజలలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉందని, వారి తరుపున న్యాయం కోసం పోరాడడానికి ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు, సంస్థలు అవసరమని ఆమె పేర్కొన్నారు. దేశంలో న్యాయస్థానాల పట్ల, చట్టాల పట్ల అవగాహన కలిగించడానికి నల్సా వంటివి లీగల్ లిటరసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, న్యాయ విద్యను అభ్యసించే యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి న్యాయ సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చట్టాలలోని సున్నితమైన అంశాలపై న్యాయ విద్యార్థులు పరిశోధనలు జరపాలని, పరిష్కార మార్గాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు మాట్లాడుతూ, దేశంలోని భిన్న భౌగోళిక పరిస్థితులు కారణంగా, నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితుల వల్ల మారుమూల ప్రాంతాల ప్రజలు న్యాయస్థానాలకు వెళ్ళలేని పరిస్థితులలో ఉన్నారని పేర్కొన్నారు. చట్టం ముందు అందరు సమానమే అన్న ప్రధాన న్యాయ స్థానాల స్ఫూర్తిని ఇది దెబ్బ తీస్తుందని అభిప్రాయ పడ్డారు. న్యాయ విద్యను అభ్యసించే యువత ఈ లోపాన్ని సరిదిద్ది ప్రజల తరుపున నిలవాలని కోరారు. స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ డైరక్టర్ ప్రొఫెసర్ బి.నళిని, రీసెర్చి విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : సమాజ సేవలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపల్ షైజీ సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1, 2 ప్రత్యేక సేవా శిబిరాల ముగింపులో ఆమె మాట్లాడారు. నిస్వార్థంగా సమాజానికి సేవ చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ, యునైటెడ్ వే ముంబై మరియు అమెజాన్ సహకారంతో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు సుమారు 750 పరిశుభ్రత కిట్లు, గర్భిణులకు 500 పౌష్టికాహార కిట్‌లు పంపిణీ చేశామన్నారు. సెబాస్టియన్ కాలనీ, జ్ఞానాపురం, ఆర్‌పి.పేట, కప్పరాడ, బర్మా కాలనీ ప్రజలకు మూడు ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.నిర్మల, అధ్యాపకులు డాక్టర్ ఎన్.నాగరాజు, డాక్టర్ పద్మ సుందరి పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన 5 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు చెందిన 190 మంది బాలికలకు స్థానిక ఎమ్మెల్యే ము త్తం శెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా సైకిళ్లు పంపిణీ చేశారు. దివీస్ సహకారంతో మండలంలోని 14 గ్రామ సచివాలయాలకు సుమారు రూ.14 లక్షలా 75 వేలు విలువైన మినీ ఆర్ఒ ప్లాంట్లను అందజేశారు. పారిశుధ్య నిర్వహణకు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు నిమిత్తం రూ.1.10 లక్షల చెక్కును ఎండిఒ పి.వెంకటరమణకు అందజేశారు. చిప్పాడలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్.రావు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : ద్విచక్ర వాహనాలను నడిపే వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని భీమిలి ట్రాఫిక్ ఎస్సై సిహెచ్.చిరంజీవిరావు సూచించారు. ఈ మేరకు గురువారం గోస్తనీ జంక్షన్ వద్ద ప్లకార్డులను ప్రదర్శిస్తూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలతో ప్రమాదాల నివారణ

ఆనందపురం : రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం పేర్కొన్నారు. ఆనందపురం మార్కెట్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డుల ద్వారా గురువారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ లేకపోవడం వల్ల గత సంవత్సరం 147 మంది ద్విచక్ర వాహనదారులు చనిపోయారని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్‌ను విధిగా ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తారకేష్ పాల్గొన్నారు.

స్కేటింగ్ విద్యార్థికి నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీకి చెందిన గొలగాని దినేష్ స్కేటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి త్వరలో జరగబోయే ఏషియన్ గేమ్స్‌కు ఎంపికైనందున విద్యార్థిని అభినందిస్తూ దివీస్ సౌజన్యంతో రూ.2.25 లక్షల చెక్కులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రీడల్లో రాణించి దేశానికి, మన నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిన్నింటి రమణ, సరగడ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస జ్యూట్ బకాయిలపై ఉదాసీనత ఎందుకు? : టిడిపి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసికి చిట్టివలస జ్యూట్ మిల్లు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయి వసూలుపై ఒకటో జోన్ అధికారులు ఉదాసీనత ఎందుకు ప్రదర్శిస్తున్నారని టిడిపి నగర కార్యదర్శి పిట్టా సురేష్ ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.22 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయి ఉన్న చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యంపై చట్ట పరమైన చర్యకు ఎందుకు వెనుకాడుతున్నారని అధికారులను ప్రశ్నించారు. జ్యూట్ మిల్లు యాజమాన్యం అమ్ముకునే ఆస్తులకు ఎన్ఒసిలు ఇవ్వడంలో ఉత్సాహం చూపుతున్న అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

గంగధార వద్ద అప్పన్నచక్ర స్నానం

ప్రజాశక్తి-సింహాచలం : శ్రీవరహా లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవంలో భాగంగా గురువారం చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి ఈశాన్యంలో ఉన్న గంగాధరలో చక్కర నారాయణ సేవ జరిపారు. ఆలయంలో చూర్ణత్సవం, వసంతోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామివారి అభిషేకం జరుగుతున్న జలాలతో భక్తులు స్నానం ఆచరించారు. ఈ కార్యక్రమంలో తీపి రాజగోపాల్, ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాస్ ఆచార్యులు ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 10న సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార నిమిత్తం ఈ నెల 10న మధురవాడలోని డిఇ కార్యాలయం వద్ద సదస్సు నిర్వహించనున్నట్లు జోన్-3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సదస్సు ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మధురవాడ, గోపాలపట్నం, పెందుర్తి, ఆనందపురం, భీమిలి సబ్ డివిజన్ల పరిధిలోని వినియోగదారులు వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.


అభివాదం చేస్తున్న అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు

జగనన్న కాలనీల్లో..

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వండి

ప్రజాశక్తి - సీతమ్మధార : జగనన్న కాలనీల ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను అప్పగించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. విశాఖ పౌర గ్రంథాలయంలో గురువారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు సొంత ఇళ్లు లేవన్నారు. నిర్మాణానికి కనీసం 60 గజాల స్థలం ఉండాలని, జగనన్న కాలనీలో ఇస్తున్న సెంటు భూమి సరిపోదని అన్నారు. ఇళ్లను నిర్మిస్తే అప్పుల పాలవుతామని లబ్ధిదారులు భయపడుతున్నారని తెలిపారు. మరోపక్క ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇల్లు అవసరం లేదని రాసి ఇవ్వాలంటూ లబ్ధిదారులను అధికారులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని పేర్కొన్నారు. అలా రాసి ఇస్తే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి ఇల్లు రాదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నజీర్ మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో నిర్మించిన కొన్ని ఇళ్లకు నేడు వైసిపి ప్రభుత్వం రంగులు వేసిందన్నారు. జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని విమర్శించారు. మధురవాడలో 300 ఎకరాలను అతి తక్కువ ధరకు అదానీ డేటా సెంటర్ పేరిట కట్టబెట్టారన్నారు. ముడసర్లోవ ప్రాంతాన్ని రిక్రియేషన్ జోన్‌గా మార్చి దోచుకోవాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎస్.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వమే నాణ్యతతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వాటా లక్షా 80 వేలు, లబ్ధిదారుడి వాటా 35 వేలు వెరసి 2 లక్షలా 15 వేలతో ఇంటిని నిర్మించుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే చాలా చోట్ల టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు తక్షణమే ఇవ్వాలని అన్నారు. సబ్బవరం, పద్మనాభం మండలాల్లో రెండు వేల ఎకరాలు కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. లోక్‌సత్తా పార్టీ ప్రతినిధి వి.హరి గణేష్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్.భాస్కర్ మాట్లాడుతూ పేదలు ఇంటి నిర్మాణం కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహమాన్, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, సిఎన్.క్షేత్రపాల్, సిపిఎం జిల్లా నాయకులు ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గ్రామ వాలంటీరు మృతి

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ళ పంచాయితీ, చౌడుపల్లి గ్రామ వాలంటీరు సాగిన చిన్నారావు (30) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. చిన్నారావు కొన్ని రోజుల పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, పరిస్థితి విషమించి మృతి చెందాడని గ్రామ సర్పంచ్ తెలిపారు. వాలంటీరు చెన్నారావు మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

9న మానవ హక్కుల కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మానవ హక్కుల కమిటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న ఉదయం 10 గంటలకు డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా సన్యాసిరావు సహా పలువురు సభ్యులను ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు తెలిపారు. మానవ హక్కుల కమిషన్, మానవ హక్కుల కోర్టుల పనితీరుపై చర్చా కార్యక్రమాన్ని న్యాయ నిపుణులు, మేధావులతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాడి తరలింపు..హామీకే పరిమితం

ముందుకుసాగని ముఖ్యమంత్రి మాట
పట్టించుకోని ఎమ్మెల్యే అదీప్‌రాజు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'మరో వారం పది రోజుల్లోనే తాడి గ్రామానికి సంబంధించి వారికి అవసరమైన రూ.56 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తాం' - 2022 ఏప్రిల్ 28న అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో నవరత్నా లు - పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పట్టాలు, హౌసింగ్ స్కీమ్ మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటిది.

ఈ హామీ ఇచ్చి మరికొద్ది రోజుల్లో ఏడాది పూర్తవుతుంది. మాట ఇచ్చిన ముఖ్యమంత్రి హామీని మర్చిపోయారు. పట్టుబట్టి నిధులు రాబట్టుకొని దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపాల్సిన ఎమ్మెల్యే అదీప్‌రాజు పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా పరవాడ ఫార్మా కంపెనీలకు వంద మీటర్ల దూరంలోని తాడి తరలింపు సమస్య దశాబ్దమున్నరగా నలుగుతూనేవుంది. ఫార్మా కంపెనీల కాలుష్యంతో బాధపడుతున్న తమను సురక్షిత ప్రాంతానికి తరలించాలని తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలు ఎంతో కాలంగా తాడి బాధితుల సంక్షేమ సంఘం నేతృత్వంలో పోరాడుతున్నారు. సిఎం హామీతో తాడి ప్రజలు తమను తరలిస్తారని భావించారు. గతంలో టిడిపి ప్రభుత్వం వలే ఈ ప్రభుత్వమూ హామీ ఇచ్చింది తప్ప సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధి ప్రదర్శించలేదు.

ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరి 6న తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను పెదముషిడివాడ తరలింపునకు టిడిపి ప్రభుత్వం రూ.57.63 కోట్లు విడుదలచేస్తూ జిఒ 29ని విడుదల చేసింది. ఇళ్లకు పరిహారం, రవాణా ఛార్జీలు చెల్లింపు సహా ఇంటి స్థలం, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలకే ప్రభుత్వం పరిమితమైందిగానీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌ను విస్మరించింది. ఆ తరువాత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.56 కోట్లు చెల్లిస్తామని ప్రకటించింది. ఈ హామీ ఆమోదయోగ్యంగా లేనప్పటికీ కనీసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంతవరకు తరలింపునకు సంబంధించిన ప్రక్రియ


కాలుష్య బాధిత తాడి గ్రామం (ఫైల్ ఫొటో)

ప్రారంభించలేదు. ఇళ్లతో పాటు భూములకు పరిహారం చెల్లిస్తే సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోవాలని తామంతా సిద్ధంగా వున్నామని తాడి ప్రజలు చెబుతున్న మాటలను ప్రభుత్వం పెడచెవినపెడుతోంది. 2017లో సర్వే చేసిన నాటికి మైనర్లుగావున్న పిల్లలు ఇప్పుడు మేజర్లుకావడంతో తాజాగా సర్వేచేసి మేజర్లందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రస్తుత ధరల ప్రకారం ఇళ్ల నిర్మాణాలకు డబ్బులివ్వాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

తాడి తరలింపుపై రీ సర్వే చేపట్టాలి

తాడి గ్రామం తరలింపుపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలుచేయాలి. గ్రామంలో రీ సర్వే నిర్వహించి లబ్ధిదారుల జాబితా ప్రకటించాలి. గ్రామసభ నిర్వహించి మేజర్ కుమారులు, కుమార్తెలను గుర్తించాలి. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలి. ప్రస్తుత ధరల ఆధారంగా ఇళ్లకు పరిహారం ఇవ్వాలి. గ్రామాల తరలింపునకు జిఒ విడుదల చేయాలి.

గనిశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

పెంచిన ఆస్తి, చెత్త పన్నులు నిలుపుదల చేయాలి

వార్వా, నివాస్ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి పెంచిన ఆస్తి, చెత్త పన్నులను నిలుపుదల చేయాలని, హెల్త్ ఎరీనా వంటి ప్రదేశాలలో ప్రవేశ రుసుం ఉపసంహరించాలని, ట్రూ ఆఫ్ ఛార్జీల వసూలు ఆపాలని వార్వా, నివాస్ కమిటీల సమావేశం జివిఎంసిని కోరుతూ తీర్మానం చేసింది. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వార్వా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బిబి.గణేష్, నివాస్ అధ్యక్షులు బి.గురప్ప, వివిధ జోన్ల నాయకులు వివి.ప్రభాకర్‌రావు, జి.రఘురామారావు, జి.నాయుడు బాబు, పి.జయ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఆస్తి పన్నును రికార్డు స్థాయిలో రూ.421.50 కోట్లు వసూలు చేసినట్లు జివిఎంసి ప్రకటించిందన్నారు. గత ఏడాది రూ. 324 కోట్లు మాత్రమే వసూలు అయినట్లు పేర్కొన్నారన్నారు. పన్ను రేట్లు పెంచకుండా ఇలా రికార్డు స్థాయిలో వసూలు చేస్తే అభినందించవచ్చున్నారు. కానీ 2021 ఏప్రిల్ నుంచి ఇంటి పన్నును ఆస్తిపన్నుగా మార్చారన్నారు. ఇందువల్ల భారీ ఆదాయం వచ్చిందన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 15 శాతం పన్ను పెంచారన్నారు. ఉదాహరణకు ఇంటి పన్ను అంతకుముందు రూ.100గా ఉండగా అది రూ.115 అయిందన్నారు. 2022 నుంచి మరో 15 శాతం పెంచారని తెలిపారు. ఇలా 2022 ఏప్రిల్‌కు ఆస్తి పన్ను రూ.132 పెరిగిందన్నారు. ఇంత భారీగా పెరిగినందున వసూలైన సొమ్ము భారీగా పెరిగిందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మరో 15 శాతం పన్ను పెంచుతారన్నారు. అంటే 52 శాతం పన్ను పెరిగినట్లు లెక్క అన్నారు. నిర్ణీత సమయానికి పన్ను చెల్లించకపోతే భారీగా 24 శాతం పెనాల్టీ విధిస్తున్నారని చెప్పారు. ఇది అసలు పన్నును మించిపోతోందన్నారు. మార్చి 31లోగా పన్ను చెల్లిస్తే పెనాల్టీ మాఫీ అనడంతో కనీసం పెనాల్టీ అయినా తప్పుతుందని అప్పో, సప్పో చేసి ప్రజలు పన్నులు చెల్లించారని చెప్పారు. అంతేతప్ప జివిఎంసి చేసిన మార్పును, పెంచిన పెనాల్టీలను అంగీకరించినట్లు కాదన్నారు. హైకోర్టులో ఆస్తి పన్నుపై కేసు పెండింగ్‌లో ఉండగా ఇలా పన్నులను ప్రజలపై రుద్దడం అన్యాయమన్నారు. పట్టణ సంస్కరణల పేరుతో చెత్త సేకరణకు నెలకు రూ.120 వసూలు చేయడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. దీనిని రద్దు చేయకుండా ఆస్తి పన్నులో కలిపి వసూలు చేయాలని జివిఎంసి నిర్ణయించడం సరికాదన్నారు. నీటి మీటర్లు బిగింపును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. టోల్ ఛార్జీలను భారీగా పెంచడంపై మండిపడ్డారు. పార్కులు, హెల్త్ ఎరీనా వంటి ప్రదేశాల్లో ప్రవేశ రుసుమును పెట్టడం దారుణమన్నారు. పార్కులు, స్టేడియాలను వ్యాపార వనరులుగా మార్చరాదన్నారు. ట్రూ ఆఫ్ ఛార్జీల వసూలు ఆపాలని డిమాండ్ చేశారు. జి 20 అంతర్జాతీయ కార్యక్రమం కోసం జివిఎంసి పెట్టిన ఖర్చును కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టాలన్నారు.


సినిమా విశేషాలను వెల్లడిస్తున్న హీరో కిరణ్ అబ్బవరం

విశాఖలో మీటర్ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మైత్రి మూవీస్ పతాకంపై నూతన దర్శకుడు రమేష్ కడూరి యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రూపొందించిన మీటర్ చిత్రం శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న సందర్భంగా ఆ చిత్ర యూనిట్ విశాఖ జిల్లాలో గురువారం సందడి చేసింది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా విశాఖ నగరంలోని పార్క్ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో హీరోయిన్లు, దర్శకుడు మాట్లాడుతూ ఇది పూర్తిగా కమర్షియల్ హంగులతో రూపొందిన వినోదాత్మక చిత్రమని అన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్ చిత్రంపై అంచనాలు పెంచాయని తెలిపారు. ప్రతి ఇంట్లో జరిగే తండ్రి -కొడుకుల కథే మీటర్ అన్నారు. విభిన్న పోలీస్ కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం అందరినీ మెప్పిస్తుందన్నారు.

భీమునిపట్నం : మీటర్ చిత్ర బృందం తగరపువలసలోగల అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ సినీ దర్శకులు రమేష్ కడూరిపై నమ్మకంతోనే ఈ సినిమాలో నటించానన్నారు. కళాశాల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందన్న నమ్మకం ఉందన్నారు. చిత్ర బృందాన్ని సత్కరించారు.



సేవాతత్పరులను సత్కరిస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

ఘనంగా వి డెంటల్ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రారంభించిన అనతికాలంలోనే అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పలువురి ప్రముఖుల అభినందనలు, సామాన్యుల అభిమానం చూరగొన్న వి డెంటల్ మల్టీ స్పెషాలిటీ కాస్మోటిక్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ మొదటి వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పలు రంగాలలో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి విశాఖ పౌర గ్రంథాలయంలో వి పురస్కార్ -2023 పేరుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వివి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజ సేవలో నిష్ణాతులైన వారిని సత్కరించి సముచితంగా గౌరవిస్తున్న వి డెంటల్ యాజమాన్యాన్ని అభినందించారు. వి డెంటల్ డైరెక్టర్ కెఎమ్‌కె.రమేష్ మాట్లాడుతూ సమాజ సేవలతో గుర్తింపు పొందిన వారిని సత్కరించుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ సంస్థ అత్యాధునిక వైద్య పరికరాలతో అత్యున్నత వైద్యాన్ని అందుబాటు ధరల్లో అందిస్తోందన్నారు. కార్యక్రమంలో రాగమాలిక కళాకారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పురస్కారాలు అందుకున్న వారిలో టివి 9 బ్యూరో చీఫ్ ఈశ్వర్, విజెఎఫ్ కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, ఆంధ్ర యూనివర్సిటీ సెక్యూరిటీ చీఫ్ ఖాన్ పాల్గొన్నారు.